విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో సరిత

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కందుకూరు, సెప్టెంబర్ 30: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బానోతు సరిత తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. కందుకూరు మండల కేంద్రంలో అండర్ 14, 17, విద్యార్థులకు జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించిన ఎంపీడీవో మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని.. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని సూచించారు. క్రీడల్లో 50 బాలుర జట్లు, 30 బాలికల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పీఈటీల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జోనల్ స్థాయి కార్యదర్శి ఢిల్లీ రవికుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, విద్యాధికారి నర్సింహ, మాజీ ఎంపీటీసీ కాకి రాములు ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సురుసాని సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సభావత్ కృష్ణానాయక్, సుధాకర్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, పీఈటీలు శేఖర్, స్వామి, భాస్కర్‌రెడ్డి, కిరణ్, అబ్బుల్లా, ఆంజనేయులు, మల్లీశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

జర్నలిస్టు ఇండ్ల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరిస్తున్న కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జర్నలిస్టులు

ఆర్కేపురం, సెప్టెంబర్ 30: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే (ఐజేయూ) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో సోమవారం రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, సాలిపురం రజనీకాంత్‌రెడ్డి, వర్దెపల్లి దశరథ, రచ్చశేఖర్, శ్యాంప్రసాద్, జంగయ్య, చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్‌రెడ్డి, చెరుకు వెంకట్‌స్వామిగౌడ్, మధు, రమేశ్, శ్రీనివాస్‌రావు, రాజు, మహేశ్, అశోక్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, సూర్యనారాయణ, ప్రేమ్, చందు, మహేశ్ తదితరులు ఉన్నారు.

'క్రీడా'లో స్వచ్ఛ భారత్ మిషన్ వార్షికోత్సవాలు

పరిసరాలు పరిశుభ్రంచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

హయత్‌నగర్, సెప్టెంబర్ 30: దేశంలో పరిశుభ్రతను పెంపొందించడానికి భారత దేశం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా స్వచ్ఛతాహీ సేవా–2024 ప్రచారాన్ని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తోంది. ఈ ఏడాది థీమ్ 'స్వభావ, స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' పరిశుభ్రతను సహజ అలవాటుగా దేశంలోని ప్రతి పౌరునిలో ప్రధాన సామాజిక విలువగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ పరిశోధనా క్షేత్రంలోని కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ(క్రీడా)లో అధికార ప్రతిజ్ఞతో ఉద్యోగులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.చంద్రకాంత్ హిట్టినహళ్లి కేవీకే అధినేత, డాక్టర్ ఎస్.విజయకుమార్, డి.సుధీర్, జీవీ చౌహాన్, జి.శ్రీకృష్ణ, పి.రామకృష్ణ, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపురం కాలనీ ఫేజ్-2 నూతన కార్యవర్గం

హయత్‌నగర్, సెప్టెంబర్ 30: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్–2 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడిగా ముద్దగోని జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడిగా కాల్వ శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా పాశం విఠల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా చిగురింత సికిందర్ రెడ్డి, కోశాధికారిగా కొప్పుల జంగయ్య గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా బాకారం నరసింహారెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, సలహాదారులుగా కల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, బృంగి శిరీశ్ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా కొండ కన్నారెడ్డి రెడ్డి, గోలి ప్రభాకర్‌రెడ్డి, బండారు లక్ష్మినారాయణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌గా గుజ్జ సుహాసిని సురేందర్ రెడ్డి, మెండు దీప పురుషోత్తం రెడ్డి, కె.రేణుకా సురేందర్‌రెడ్డి, కె.చలపతిరెడ్డి, అనిరెడ్డి శ్వేత శశివర్ధన్‌రెడ్డి, కండె రాజేందర్, యు.రాజు ఎన్నికయ్యారు.

దేవీ శరన్నవరాత్రుల కరపత్రాలు ఆవిష్కరణ

ఆర్కేపురం, సెప్టెంబర్ 30: ఆర్కేపురంలోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా దేవీ శరన్నవరాత్రులు అక్టోబర్ 3 నుంచి 12 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లి శ్రీనివాస్ తెలిపారు. శరన్నవరాత్రుల కర పత్రాలను సోమవారం ఆలయ ఆవరణంలో ఆవిష్కరించారు. విఠల్‌శర్మ, అరుణ, హేమంత్‌శర్మ, రామ శర్మ, అశ్వంత్, సంతోషి, హేమ, పద్మలక్ష్మి, పూర్ణిమ తదితరులు ఉన్నారు.

నాలా ఏర్పాటుతో మురుగునీటి సమస్యకు పరిష్కారం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: ఆటోనగర్ నుంచి హిమపురికాలనీ మార్గంలో ఏర్పాటు చేస్తున్న నాలాతో సహారాస్టేట్స్‌కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్ నుంచి హిమపురి కాలనీ మార్గంలో రూ.6కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న బాక్స్‌టైప్ ట్రంక్‌లైన్ పనులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, సహారాస్టేట్స్ కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, గఫార్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట సర్కిల్ టీపీవో సునీత బదిలీ

సైదాబాద్, సెప్టెంబర్ 30: మలక్‌పేట సర్కిల్–6 జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న టీపీవో సునీత బదిలీ అయ్యారు. ఆమెను ఖైరతాబాద్ సర్కిల్‌లో టీపీవోగా బదిలీ చేయగా, అక్కడ టీపీవోగా పనిచేస్తున్న నర్సింగ్‌ను మలక్‌పేట సర్కిల్‌కు బదిలీ చేస్తూ జీహెచ్ఎంసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

క్షణ క్షణం.. భయం భయం..!

- గూడు కోసం..
- రాత్రుల్లో సైతం కాపలా..!
- వెంటాడుతున్న కూల్చివేతల భయం
- మూసీ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో మేల్కొని ఉంటున్న స్థానికులు
- శత్రు దేశాలపై యుద్ధం చేస్తున్నట్టుగానే మాపై దాడులు అంటూ బాధితుల ఆగ్రహం
- కూల్చివేతలను అడ్డుకుంటామని హెచ్చరిక
- ఎమ్మెల్యే, ఎంపీ భరోసా కల్పించినా వీడని ఆందోళన

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సత్యానగర్ కాలనీవాసులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: భయాందోళనలోనే కాలం వెల్లబుచ్చుతున్నారు ఎల్బీనగర్ నియోజకవర్గం మూసీ పరీవాహక ప్రాంతమైన భవానీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరికాలనీ, సత్యానగర్, న్యూమారుతినగర్ నార్త్ కాలనీలకు చెందిన ప్రజలు. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఇటీవల మూసీ పరీవాహక ప్రాంత కాలనీల్లో పర్యటించి ఎవరూ అధైర్య పడవద్దని అభయమిచ్చినప్పటికీ తమ నివాసాలు సురక్షితమనే విషయంలో కొంత సందిగ్ధత నెలకొన్నది. పోలీసుల బందోబస్తు మధ్య కాలనీల్లో మార్కింగ్ చేసి వెళ్లిన రెవెన్యూ అధికారులు ఏ రాత్రి తమ ఇండ్లపై పడతారేమోనన్న భయం వెంటాడుతూనే ఉంది. లక్షా యాభై వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తానంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పంతం నెగ్గించుకునేందుకు పేదలను బలి పెడతాడేమోనని ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో బుల్డోజర్లతో ఇండ్లపైకి వస్తారేమోనన్న భయంతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకులేకుండా పోయింది. ఇండ్లను కాపాడుకునేందుకు పెద్ద, చిన్నా అనే తారతమ్యం లేకుండా వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం రాత్రంతా జాగారం చేస్తున్నారు. రాత్రి వేళ గస్తీ నిర్వహించేందుకు వచ్చే పోలీసు వాహనాల సైరన్లు విన్నా ప్రజలు హడలెత్తి పోతున్నారు. మూసీ అభివృద్ధి పేరిట లక్షలాది రూపాయలు వెచ్చించి కట్టుకున్న ఇండ్లను కూలిస్తే తమ పరిస్థితి ఏమిటనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ కట్టామని.. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సక్రమ మార్గంలో నిర్మించిన ఇండ్లను కూల్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన భరోసా కొంత ఉపశమనం కలిగించినప్పటికీ ఇండ్లపై భద్రతపై ప్రజల్లో భయం వెంటాడుతూనే ఉంది. పోలీసుల బందోబస్తు మధ్య ఏ రాత్రి వచ్చిన ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని తమ ఇండ్లను కాపాడుకునేందుకు ప్రాణ త్యాగాలకైనా సిద్ధమేనంటున్నారు ప్రజలు.

కష్టపడి సంపాదించిన సొమ్ముతో కట్టుకున్న ఇల్లు

ఒక పూట తిని తినకా కష్టపడి ఇల్లు కట్టుకున్నాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోండి అంటే ఎలా. కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించుకున్న ఇంటిని కూలుస్తామంటే మేము ఎలా బతకాలి. ఇల్లు కూలిస్తే నేను, నా పిల్లలు ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వమంటే పేదల పక్షాన ఉండాలి కానీ.. బడాబాబుల కోసం పేదల ఇండ్లను కూల్చాలని చూడటం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది.

– సంధ్య, సత్యానగర్ కాలనీ

పేదల ఇండ్లు కూల్చడమే కాంగ్రెస్ తీసుకొచ్చిన మార్పా

మార్పు కోసం మీ ముందుకు వస్తున్నానంటే ఇంకా ఏదైనా చేస్తాడేమోనని అనుకున్నాం. మా బతుకులు ఏమైనా మారుతాయేమోనని మల్కాజిగిరి ఎంపీగా గెలిపించి రాజకీయ భిక్ష పెట్టినం. మేము ప్రసాదించిన భిక్షతో చివరికి ముఖ్యమంత్రి అయ్యాడు. ముఖ్యమంత్రి కాగానే మార్పు పేరిట పేద ప్రజల ఇండ్లను గుంజకుంటాడనుకోలేదు. నమ్మినందుకు మా పొట్ట మీదే కొట్టాలని చూస్తున్నావు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పేదల ప్రజల గోస నీకు తప్పక తగులుతుంది.

– నర్సమ్మ, సత్యానగర్ కాలనీ

లక్షలు పెట్టి కట్టుకున్న ఇంటిని ఖాళీ చేసి వెళ్లాలా

జీవనోపాధి కోసం ఉత్తర భారదేశం నుంచి వచ్చి పదిహేను సంవత్సరాల క్రితం ఫణిగిరికాలనీలో ప్లాటు కొనుగోలు చేశాం. చట్టప్రకరం ఇంటి జాగాను రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇల్లు కట్టుకున్నాం. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ కట్టాం.. ప్రతి ఏట ఇంటి పన్ను కడుతున్నాం. ఇంటి ముందు సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ కల్పించారు. మేము సక్రమ మార్గంలో ఇంటిని కట్టుకున్నామనే కదా మాకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. ఇప్పుడు వచ్చి మీ ఇల్లు మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంది.. మేము మూసీని అభివృద్ధి చేస్తాం ఇల్లు ఖాళీ చేసి డబుల్ బెడ్ రూమ్‌కు వెళ్లిపొమ్మంటే ఎలా. ప్రాణం పోయిన లక్షలు వెచ్చించి కట్టిన ఇంటిని వదులుకోం.

– కైలాష్, ఫణిగిరికాలనీ

వ్యక్తి అదృశ్యం..

ఉడుతల వెంకటయ్య (ఫైల్)

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం సెంట్రల్‌లో నివాసముంటున్న ఉడుతల సత్యనారాయణ డ్రైవర్. నెల రోజుల క్రితం సత్యనారాయణ ఇంటికి సోదరుడు ఉడుతల వెంకటయ్య (52) వచ్చి ఇక్కడే నివాసముంటున్నాడు. వెంకటయ్యకు ఫిట్స్ సమస్య ఉండటంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. సెప్టెంబర్ 25న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తన సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

మలక్‌పేట, సెప్టెంబర్ 30: ప్రైవేట్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాలివాహననగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మౌనిష్(32) మూడేండ్ల నుంచి భార్యతో కలిసి మూసారాంబాగ్‌లోని శాలివాహననగర్‌లో నివాసముంటున్నారు. అతడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండగా, అతడి భార్య కూడా ప్రైవేట్ ఉద్యోగి. కాగా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన అతడు తీవ్రంగా నష్టపోవటంతో ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. తీవ్ర మనస్తాపానికి గురైన మౌనీష్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ..

చంపాపేట, సెప్టెంబర్ 30: గుర్తు తెలియని దుండగులు మహిళ మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని పారిపోయిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్కాపురి కాలనీ రోడ్ నంబర్–8లో నివాసముండే లక్ష్మిసుజాత (65) సురుకులు తెచ్చుకునేందుకు బయటకి వెళ్లగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసు తెంచుకొని పారిపోయాడు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఏపీసీ కృష్ణయ్య, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తామని బాధితురాలికి భరోసా కల్పించారు.

న్యాయమూర్తితో విచారణ జరిపించాలి

ఆర్కేపురం, సెప్టెంబర్ 30: టీటీడీ లడ్డూ వ్యవహారంలో సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డా.రావినూతల శశిధర్ తెలిపారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపేట చౌరస్తాలో నిరసన తెలిపిన అనంతరం మనవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీ దేవాలయంపై ప్రభుత్వ పెత్తనం తొలగించి ధార్మిక పరిషత్, సనాతర బోర్డులు ఏర్పాటు చేసి దేవాలయాలను హిందూ సమాజానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. కల్లెం రాజేందర్‌రెడ్డి, సామ రంగారెడ్డి, సంజయ్‌శర్మ, బాలరాజేశం, రమేశ్, రాజేందర్‌రెడ్డి, రాధాధీరజ్‌రెడ్డి, ఆరుట్ల సురేశ్ కుమార్ ఉన్నారు.

నాగోల్ నుంచి ఎల్బీనగర్ మార్గంలో మెట్రో విస్తరణ పనులను చేపట్టాలి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రో విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మామిడి రాంచందర్ కోరారు. ఎల్బీనగర్ కామినేని చౌరస్తాలోని ఆక్సిజన్ పార్కు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగోల్, ఎల్బీనగర్ మార్గంలో మెట్రో ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మెట్రో విస్తరణ వలన ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో నివాసముండే వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వెసులుబాటు లభిస్తుందని తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే ప్రభుత్వం మెట్రో పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమావత్ రవినాయక్, సభావత్ కృష్ణనాయక్, పోచబోయిన శ్రీకాంత్‌యాదవ్, ప్రవీణ్, సాంబయ్య, కుమార్, వెంకటేశ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

ఆర్కేపురం, సెప్టెంబర్ 30: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు బండి మధుసూదన్‌రావు, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, జిన్నాం వెంకటేశ్, మచ్చేందర్‌రెడ్డి, నాయకులు పున్న గణేశ్‌నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, గట్ల రవీంద్ర, పగిళ్ల భూపాల్‌రెడ్డి, పెద్దవూర సైదులు, శివ, ముప్పిడి లింగస్వామిగౌడ్, వంగూరి యాదవరెడ్డి, కల్యాణ్, జెల్ల జగన్నాథం, పగడాల ఎల్లన్న, దుర్గ ప్రసాద్, శ్యామ్‌సుందర్‌గౌడ్, జంగారెడ్డి, సందీప్, తదితరులు ఉన్నారు.

లాడ్జి తొలగించాలని ఆందోళన

సైదాబాద్, సెప్టెంబర్ 30: జనవాసాల మధ్య ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన ఓయో లాడ్జిను తొలగించాలంటూ కాలనీవాసులు అధికారులను కోరుతూ ఆందోళన చేపట్టారు. సోమవారం సైదాబాద్ కరణ్‌బాగ్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాల్యాద్రి శ్రీనివాస్ శ్రీకరం మాట్లాడుతూ.. ప్రశాంతమైన కాలనీలోని జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన ఓయో లాడ్జి మూలంగా అనేక మంది కొత్త వ్యక్తులు, యువతీ యువకులు సంచరిస్తుండటంతో స్థానికంగా నివసించే మహిళలు అటువైపుగా వెళ్లాలంటే అసౌకర్యంగా ఉందని.. పగలు, రాత్రి తేడాలేకుండా కొత్త వ్యక్తులు కాలనీలో వాహనాలపై సంచరిస్తూ.. కాలనీ ప్రశాంత వాతావరణాన్ని దెబ్బదిస్తూ, ఈవ్ టీజింగ్ వంటి అనేక సమస్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాలనీ పేరుప్రతిష్టలను దిగజార్చే విధంగా కాలనీ మధ్యలో ఏర్పాటు చేసిన ఓయో లాడ్జిని వెంటనే తరలించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చెపడుతామని కరణ్‌బాగ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షులు రాజనర్సింహారెడ్డి, శ్రీహరి, వసంత్ కుమార్, శరత్‌కుమార్, రవిచంద్ర, వేణుగోపాల్‌రావు, జమీల్, విజయ్ కుమార్‌గుప్తా, లక్ష్మీకుమారి, స్వరూప రాణి, విజేత, మధుసుదన్ రెడ్డి, త్రిమూర్తులు, రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు వినతి పత్రం ఇస్తున్న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నేతలు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

చంపాపేట, సెప్టెంబర్ 30: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొక్కొండ వైకుంఠం గుప్తా తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని, క్వింటాల్ రేషన్‌కు రూ.300 కమీషన్ ఇప్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎల్కట్రానిక్ ప్రింటెడ్ వే బిట్స్ ఏర్పాటు చేయాలని, డీలర్లందరికి రూ.10లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గడ్డం మల్లికార్జున్ గౌడ్, నీల్ల రాజశేఖర్ గౌడ్, సంపత్‌కుమార్, వరుణ్, రమేశ్‌గుప్తా, పవన్, వివేక్, అమరేందర్, తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో దత్తాత్రేయ ఆలయం

అల్మాస్‌గూడలోని సీఎంఆర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న దత్తాత్రేమ సహిత సాయి మందిరం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దశాబ్దంన్నర కాలంగా నిర్మాణంలో ఉండి ప్రారంభానికి నోచుకోని అల్మాస్‌గూడలోని షిర్డీసాయి మందిరాన్ని దత్తాత్రేమ సహిత సాయి మందిరంగా ఏర్పాటు చేస్తున్నామని కాలనీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి తెలిపారు. అల్మాస్‌గూడలోని సీఎంఆర్ కాలనీ ఆలయం ప్రాంగణంలో సోమవారం జరిగిన సమావేశంలో కాలనీవాసుల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గతంలో షిర్డీ సాయి మందిరం నిర్మాణం చేపట్టాలని ప్రయత్నించినప్పటికీ పలు కారణాలతో సాధ్యం కాలేదని, ప్రస్తుతం కలియుగ గురువు దత్తాత్రేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రెండతస్తుల భవనంలో నిర్మిస్తున్న దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, డిసెంబర్ 14న దత్త జయంతి రోజున ప్రారంభోత్సవం చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సమావేశంలో భక్తులు గడియారం నాగ శ్రీనివాస శర్మ, కాలనీవాసులు బల్వంత్ రెడ్డి, గుగ్గిళ్ల వినోద్ గుప్తా, నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఐడీఎల్ మహిళా డిగ్రీ కళాశాల చైర్మన్ మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ నాగం మాలతీ, కార్యదర్శి నన్నూరు సీతారామరెడ్డి

మలక్‌పేట, సెప్టెంబర్ 30: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని.. వాటి సాధనకు కృషి చేయాలని దిల్‌సుఖ్‌నగర్ ఐడీఎల్ మహిళా డిగ్రీ కళాశాల చైర్మన్ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కేకే గార్డెన్స్‌లో కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల వైస్ చైర్మన్ నాగం మాలతీ, కార్యదర్శి నన్నూరు సీతారామరెడ్డి, కోశాధికారి నన్నూరు మంజురెడ్డి, ప్రిన్సిపాల్ వెదిరె వీణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ సురేజ్ దోమజీ ఫటభజే, చిత్రంలో డీసీ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్లు చింతల అరుణ, కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: బండ్లగూడలోని జీఎస్ఐ ఉద్యోగులు, జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జీఎస్ఐ సమీపంలోని మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కు ఎదురుగా నిర్వహించిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ సురేజ్ దోమజీ ఫటభజే, కార్పొరేటర్లు చింతల అరుణ, కొప్పుల నర్సింహారెడ్డి హాజరయ్యారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా డీసీ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ.. చెత్తను రోడ్లపైన వేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామన్నారు. జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ సురేజ్ దోమజీ ఫటభజే మాట్లాడుతూ.. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించేందుకు జీఎస్ఐ ఆధ్వర్యంలో మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కు వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్పొరేటర్లు చింతల అరుణ, కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇంటి ముందుకు వచ్చే రిక్షాల్లోనే చెత్తను వేసి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ డీడీజీలు ఎల్‌పీ సింగ్, ఎస్ఎన్ పాత్ర, జీఎస్ఐ ఉద్యోగులు హర్మోహన్ మిశ్రా, ఎస్. తారకేశ్వరరావు, ఆదర్శ మహేశ్, మధిర సత్యనారాయణ, దివాకర్‌రెడ్డి, కె.నరేందర్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

సుంకోజు కృష్ణమాచారి

చంపాపేట, సెప్టెంబర్ 30: చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వకర్మ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి తెలిపారు. సోమవారం కర్మన్‌ఘాట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి తదితర చేతి వృత్తిదారులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అదే విధంగా 50 ఏండ్లు దాటిన వారికి ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలని.. ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంటి ముందుకు వచ్చే రిక్షాల్లోనే చెత్తను వేయండి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: ఇంటి ముందుకు వచ్చే రిక్షాల్లోనే చెత్తను వేయడాన్ని ప్రజలు అలవర్చుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సమకూర్చిన చెత్త రిక్షాలను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ చందన, నాయకులు రవి, మహేందర్‌యాదవ్, కాట విజయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.